# సరళ

శ్రీ చల్లా సత్యేంద్రశంకర్‌గారు

సరళ సహజంగా అందమైనది. శారీరక అందాన్ని మించినదామె మనసు మెలగే 'మంచితన' మనే అందం. ఆమె అందమైనదని ప్రపంచాన్ని మోహ పరచగలనని ఆమె గర్వించినట్లెప్పుడూ తెలియదు. ఇదే ఆమె నిరాడంబరతను నిరూపిస్తుంది.

ఆమె ఒక వున్నత కుటుంబానికి ఏకైక కుసుమం. ఏకైక ప్రతిబింబం. కష్టమనే మాట, కష్టమనే కాళ పిశాచం మానవ లోకాన్ని ప్రతిక్షణం వెంటాడుతుందని, కలిమి లేములు తప్పని సరియని ఆమె బాల్యావస్థలో ఎరుగదనే చెప్పాలి. సుఖాల్లో సోలిపోతూ ఆనందంలో అలసిపోతూండే పరిసరాల్లోనే ఆమెనివాసం.

రోజులు కదిలిపోతున్నాయి. ఆమెలో 'బాల్యం' సడలిపోతూంది. ఏదో నూతనత్వం ఆమె జీవితద్వారంలో కొంటెగా, చిలిపిగా, ఓరగా నిలిచిచూస్తూంది అదే ఆమె జీవితంలో తొలిమెఱుపు. యౌవనోదయానికి ఉపోద్ఘాతం.

బాధ్యత నెరుగని యీ 'బాల' బరువుగా నడుస్తూంది. అదే ఆమె జీవితములోని మొదటి గిలిగింత: జీవిత సోపానానికి తొలిమెట్టు. పూవు పూసింది. తీగబరువుగా వూగింది.

సరళ తలితండ్రు లెరుగుదురు పూవులోని పరిమళం పరిసరప్రాంతాన్ని తనవైపు కాకర్షిస్తుందని. పూవుని దాచగలరు. పరిమళాన్ని ?

ఇప్పుడామెలో ఒక కోరిక, జీవితంలో ఒక ఆశయం జనించాయి. కదలేకాలంలో పురోగమించే ప్రపంచంలో ఆమె ఒకవ్యక్తి, ఒక సభ్యురాలు. ఈ తలంపు నామె ఎప్పుడూ విస్మరించలేదు. మానవ సంఘంలో తనసభ్యత్వానికి రాజీనామా దాఖలుపరచి ఏకాంత జీవనానికి అంకిత మవుదామనే వుద్దేశ మామెలో కలిగినట్లు ఆమె చేసేపనిలో కాని, ఆచరించే ఆచరణలో గాని ద్యోతక మవలేదు. పుష్పాన్నలంకరించుకొనే వారు దాన్నిచ్చిన వ్రేళ్లను మరచినట్లు, తనకీ సుఖాల నిచ్చిన కష్టజీవి నామె ఎన్నడూ మరువలేదు.

వికసించిన ఆమె మనస్సనేక సుగంధాలను గుబాళించుతోంది. మానవ లోకంలోకి ఆమెదారులు కనుక్కో నవసరంలేక పోయింది. మధుర భావాలు మార్గాలై ఆమెను ప్రజానీకపు హృత్సీమలలో ప్రవేశ పెట్టాయి. కష్టజీవికి, పేద ప్రజకి, 'మరవబడ్డ మనిషి' కి ఆమె ఒక దేవత. దారిద్ర్యానికి, బానిసత్వానికి పాశ బద్ధులైన వారికి విముక్తికి దారిచూపే మార్గదర్శి !

ప్రజలలో ఆమె, ఆమె పేరు, ఆమె ఆదర్శాలు చిర పరిచితములు. ఆమె వాళ్ల 'మనిషే' అయిపోయింది. వాళ్లామె పాశబద్ధులు.

ముందుచూస్తే కష్ట జీవికన్నీళ్లు, పేద ప్రజ ఆర్తనాదాలు. వెనుకచూస్తే ఆటంక పడే తలితండ్రులు. ఈ సందిగ్ధస్థితిలో ముందా వెనుకా ఆమె చేపట్టవలసినది ?

తను, బ్రతికిన 'వ్యక్తు'ల కొరకా లేక బతకబోయే 'ప్రజ' కొరకా అనేది ఆమెను కలవర పెట్టకపోలేదు. కొన్నినాళ్లామె కుమిలిపోయింది.

బెదరింది. బేలయైపోయింది. కృశించిపోయింది. అబలలా అల్లాడిపోయింది. ముందు కార్యమేమో ఆమె చిత్రించుకొని చూచింది. అబ్బా! అని నిట్టూర్చింది. కన్నీరు కార్చింది. ఇదేకదా తను బ్రతుకబోయే లోకం అనుకుంది. కదలిందామె మనస్సు. తల్లడిల్లిందామె హృదయ కమలం ప్రజకామె ఒక ఆశ. ఒక ఆరనిజ్యోతి. ఈ విషయం ఆమెయెప్పుడు మరువలేదు. ప్రస్తుతాన్ని గూర్చి భవితవ్యాన్ని పోగొట్టుకో నిచ్ఛగించలేదు.

మాతాపిత లెదురు తిరిగెదరని ఆమెకు తెలియకపోలేదు. వాళ్లు ఖేదిస్తారని తనకై బెంగతో కృంగి కృశించి పోతారని ఆమె బాగా ఎరుగు. అయినా త్యజించింది. ముందు కార్యక్రమానికి ప్రణాళిక నేర్పరచుకుంది. ఆకలితో అట మటించే ఆర్త జీవుల ఆకాంక్షను ఆచరణలోకి తెచ్చుటకై ఆమె అనిశీథిలో లీనమయింది. ఆటంక పడే అల్పసంఖ్య గుర్రు పెడ్తూంది. నీరస ప్రజ ఆమెకై నిక్కి చూస్తూంది.

# 'శ్రద్ధాంజలి'

స్వాతంత్ర్యం సిద్ధించినది మొదలు మన భారత దేశం అమూల్య రత్నాలను పోగొట్టుకొనుచున్నది పూజ్య బాపూజీ వియోగానికే బావురుమనుచున్న భారత ప్రజలను నారీశిరోరత్నమగు శ్రీమతి సరోజినీదేవి నిర్యాణ వార్త "గోరుచుట్టుపై రోకలి పోటు" వలె కంపింప జేసినది అయ్యో, భారత నారీమణుల దురదృష్ట రేఖయా! జగన్నాటక రంగమున విషాదాంత సంఘటనమా! అజ్ఞాన మేఘరాసియలము కొని యున్న నారీ లోకమున తళుక్కున మెఱసి విజ్ఞాన ప్రభల వెల్గారిన దివ్యతార రాలిపోయినది మహిళా లోకము అంధకారావృతమైనది. అజ్ఞానావస్థ నున్న స్త్రీ జాతిలో విజ్ఞాన తృష్ణను బురికొల్పి స్త్రీ శక్తి నుద్దీపింపజేసి స్వాతంత్ర్య పథమునకు పురోగమింప జేసిన మాతృదేవత, మన సరోజినీదేవి. స్త్రీల నావరించియున్న "అబలా" త్వమును రూపుమాపి కేవలము స్త్రీ స్వాతంత్ర్యమునకే గాక స్త్రీ పురుష సమానత్వమునుద్ఘాటించిన మహా వ్యక్తి మన సరోజినీదేవి. వీను మిగిలిన విజ్ఞాన ప్రతిభతో కవితాకన్యకేలుబట్టి కళావినోదినియై దేశదేశముల తన కవితా ఝురుని ప్రవహింపజేసి కవికోకిలయై విహరించి స్త్రీల కవితా కౌశలమునుద్దీపింపజేసిన కళా మూర్తి ఆమె. ఆమె సంస్మరణ లేఖిని కందదేమో

"భారత పిత" బాపూజీ ఆశయ నిర్వహణలో మత విద్వేషాలను రూపుమాపి శాంతి స్థాపనకై శాంతి బోధనలతో ఆమె జూపిన ఓర్పు, సౌభ్రాతృత్వమే యు. పి. గవర్నరుగ నాహ్వానింపబడుటకు కారణము చక్కని పరిపాలనతో కల్లోలముల నణగింపజేసి ప్రజా హృదయాలను చూరగొన్న ఆకమనీయ మూర్తి కివే జోహారులు ఆమె నిర్యాణము భారత స్త్రీల దురదృష్టము. ఆమె అంతరించిననూ ఆమె ఆత్మ శక్తి భారత స్త్రీలకు రక్ష యగుగాక! భారత మహిళలు ఆమె అడుగు జాడల్లో ఆమె అందజేసిన సందేశములు శిరసావహించి ఆచరించి ఆ ధన్యజీవి ఆత్మశాంతికై శ్రద్ధాంజలు లొసంగుదురు గాక!

—డి యస్. రాజేశ్వరీపట్నాయక్